సాక్షి ప్రకాశం

సోమవారం । 21 । జులై । 2025



నగర పాలన దిగజారి..

ఒంగోలు నగరం చెత్త, చెదారంతో కుళ్లిపోతోంది. పారిశుధ్య పనుల నిర్వహణలో నగరపాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవడంతో ఈ దుస్థితి నెలకొంది. - 8లో..



మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన

నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 37 /28

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు, మెరుపులతో జల్లులు పడవచ్చు

న్యూస్‌రీల్

బూచేపల్లిని కలిసిన పార్టీ రాష్ట్ర కార్యదర్శులు



బూచేపల్లిని మర్యాద పూర్వకంగా కలిసిన కేవీ.రమణారెడ్డి, వెంకటేశ్వరరావు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులుగా (పార్లమెంట్) నియమితులైన కె.వి.రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావులు పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబులను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం

- మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె



అన్నా రాంబాబు



జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేయడం అక్రమమని మార్కాపురం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, నెల్లూరు పార్లమెంట్ పరిశీలకుడు జంకె వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులను అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టడం దారుణమని అన్నారు. వైఎస్సార్ సీపీ నేత, లోక్‌సభ పక్ష నేత అయిన మిథున్ రెడ్డిని మద్యం కేసులో అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. లేని కేసును సృష్టించి అబద్ధపు సాక్ష్యాలతో ఎంపీని అరెస్టు చేసిన విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సిట్‌ను ఏర్పాటుచేసి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. మిథున్ రెడ్డిని వెంటనే విడుదల చేయాలని కోరారు.

భూములను పరిశీలించిన ఏపీఐఐసీ అధికారులు



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ డైరెక్టర్

దొనకొండ: దొనకొండ ప్రాంతంలోని బాదాపురం రెవెన్యూలోని భూములను ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ మోహన్‌తో కలిసి డీఆర్‌డీఓ డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ ఆదివారం పరిశీలించారు. ఈ ప్రాంతంలో బ్రహ్మోస్ క్షిపణులు తయారు చేయడానికి అనుకూలమైన ప్రాంతమని, సుమారు 400 ఎకరాలు అవసరమని వారు తెలిపారు. కనిగిరి ఆర్‌డీఓ జి.కేశవర్ధనరెడ్డి ఈ ప్రాంత విషయాలను, అనుకూల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత రెవెన్యూ మ్యాపులు పరిశీలించారు. ఈ భూముల్లో ఆక్రమణలు ఉన్నాయా, రైతులు పంటలు పండించుకునే భూములా వంటి విషయాలపై రెవెన్యూ వారి నుంచి సమాచారం సేకరించారు. అనంతరం పాత ఎయిర్ పోర్టును పరిశీలించారు. ఇది ప్రాథమిక సర్వే మాత్రమేనని, మళ్లీ క్షుణ్ణంగా పరిశీలిస్తామని వారు తెలిపారు. వారి వెంట ఏపీఈడీబీ అధికారి ఐశ్వర్య కోశరాజు, తహసీల్దార్ బి.రమాదేవి, ఏపీఐఐసీ సర్వేయర్ అనిల్, డీటీ కెవి.నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.


హైస్కూల్ ప్లస్‌పై కూటమి కాటు

గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌గా గత ప్రభుత్వంలో మార్పు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైస్కూల్ ప్లస్ కళాశాలల్లో అధ్యాపకులు, మౌలిక వసతులు కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇంటర్మీడియెట్ కోర్సుల్లో విద్యార్థులు చేరేందుకు వెనకాడుతున్నారు. అడ్మిషన్లు లేక కాలేజీలు వెలవెలబోతుంటే ఏం చేయాలో పాలుపోక ప్రిన్సిపాళ్లు తలపట్టుకుంటున్నారు.

- కూటమి ప్రభుత్వం వచ్చాక హైస్కూల్ ప్లస్ కళాశాలలపై నిర్లక్ష్యం
- పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులు కరువు
- వసతులు లేక చేరేందుకు విద్యార్థుల వెనకడుగు
- టీసీలు తీసుకుని వెళ్తున్న సీనియర్ ఇంటర్ విద్యార్థులు
- తలలు పట్టుకుంటున్న ప్రిన్సిపాళ్లు
- జిల్లాలో 21 హైస్కూల్‌ప్లస్ కళాశాలలు



బేస్తవారిపేటలోని ప్లస్‌టూ జెడ్పీ బాలుర హైస్కూల్



బేస్తవారిపేట: గ్రామీణ ప్రాంతాల్లోని బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు జాతీయ విద్యా విధానంలో భాగంగా 2022లో అప్పటి ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌లను ప్రవేశపెట్టింది. ముఖ్యంగా రూరల్ ప్రాంతాల్లోని బాలికలు, పేద విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు హైస్కూళ్లను హైస్కూల్ ప్లస్‌లుగా మార్పు చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యా బోధన అందించేందుకు అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు డిప్లాయ్‌మెంట్ ద్వారా హైస్కూల్ ప్లస్‌లలో నియమించుకుని విద్యా బోధనకు శ్రీకారం చుట్టారు. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్లస్‌టూ కళాశాలల్లో అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయి. సరైన వసతులు కల్పించక, అధ్యాపకులను నియమించకపోవడంతో ఈ దుస్థితి నెలకొన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వసతులు, అధ్యాపకులు లేక..

ఒక్కో హైస్కూల్ ప్లస్‌లో అందుబాటులో ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో ఒక్కో గ్రూపునకు 53 మంది చొప్పున 159 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జిల్లాలో 21 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియెట్ కోర్సులను ప్రారంభించారు. దీనికి వసతుల లేమి, అధ్యాపకుల కొరత ప్రధాన సమస్యలుగా ఉండటంతో అడ్మిషన్లు కావడంలేదు. ఈ హైస్కూల్ ప్లస్‌లలో ఒక్కో స్కూల్‌కు దాదాపుగా ఏడుగురు టీచర్లు ఉండాలి. అయితే కొన్నింట్లో టీచర్లు ఉంటే విద్యార్థులు లేకపోవడం, విద్యార్థులుంటే టీచర్లు లేకపోవడం వంటి సమస్యలను విద్యాశాఖ పరిష్కరించకపోవడంతో ఆ ప్రభావం అడ్మిషన్లపై పడుతోందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యార్థులకు జీవశాస్త్రం, భౌతిక, రసాయన శాస్త్రాలకు సంబంధించి తరగతి గదులు, ల్యాబ్‌లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాల్సి ఉంది. పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించి, మౌలిక వసతులు ఏర్పాటు చేస్తే మంచి ఫలితాలు వస్తాయని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

విద్యార్థుల భవిష్యత్‌పై కొరవడిన ఆలోచన

కళాశాలలు తెరచి నెలన్నర అవుతున్నా ఇంటర్ విద్యార్థుల భవిష్యత్ గురించి విద్యాశాఖ ఆలోచించలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ప్లస్‌టూ కొనసాగిస్తారా లేదా అనే సమాచారం కూడా ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులకు ఏం చెప్పాలో అర్థంకాక ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తలలు పట్టుకుంటున్నారు. బేస్తవారిపేట, ముండ్లపాడు కళాశాలలో ఒక్క ఉపాధ్యాయుడు లేకపోవడంతో కొత్త అడ్మిషన్లు ఒక్కటీ కాలేదు. సీనియర్ ఇంటర్ విద్యార్థులను సమీపంలోని కంభం, గిద్దలూరులోని ప్లస్‌టూ కళాశాలలకు పంపేందుకు ప్రయత్నిస్తున్నారు.

రిలీవైన టెన్త్ విద్యార్థులు..

వాస్తవానికి ఇక్కడ చదివిన టెన్త్ పాసైన విద్యార్థులను ఇంటర్మీడియెట్‌కు ప్రమోట్ చేయాల్సి ఉంది. కళాశాలలో సరైన వసతులు లేకపోవడం, ల్యాబ్ ఏర్పాటు చేయకపోవడం, ఉపాధ్యాయుల కొరత ఉంది. ఇక్కడ చదువుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల ఇబ్బందులు గమనించిన టెన్త్ పూర్తయిన విద్యార్థులు అక్కడ ప్లస్‌టూలో చేరేందుకు సుముఖత చూపడంలేదు.

ఈ ఏడాది అసలు పట్టించుకోలేదు..

2022లో 10 ఉన్నత పాఠశాలలు, 2024లో మరో 11 ఉన్నత పాఠశాలల్లో ఇంటర్మీడియెట్‌ను ప్రారంభించారు. ఇంటర్ తరగతులు చెప్పే ఉపాధ్యాయులకు ఇంక్రిమెంట్ ఇస్తామనడంతో ఉపాధ్యాయులు చేరారు. 2024–25 ఎన్నికల సమయం కావడంతో పూర్తి స్థాయిలో దీనిపై దృష్టిపెట్టలేదు. అప్పట్లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద, డిప్యుటేషన్‌లపై పీజీ చేసిన ఉపాధ్యాయులతో ఇంటర్ తరగతులు చెప్పించారు.

2025–26లో వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై కానీ, డిప్యుటేషన్‌లపై కానీ అర్హులైన ఉపాధ్యాయులను నియమించలేదు.

లెక్చరర్ల కొరత ఉంది

హైస్కూల్ ప్లస్‌లో లెక్చరర్ల కొరత ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లాం. అధ్యాపకుల నియామకం, అర్హులైన ఉపాధ్యాయుల డిప్యుటేషన్, వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌పై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఆదేశాలు వచ్చిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్ రమణారెడ్డి, ఎంఈఓ, బేస్తవారిపేట

హైస్కూల్ ప్లస్‌లను నిర్వీర్యం చేయడం తగదు

దూర ప్రాంతాలకు వెళ్లి ఇంటర్ విద్యను అభ్యసించలేని పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన హైస్కూల్ ప్లస్‌లను నిర్వీర్యం చేయడం తగదు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఉన్న హైస్కూల్ ప్లస్ వ్యవస్థను పటిష్టం చేసి కొనసాగించాలి. అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు జూనియర్ లెక్చరర్ హోదా కల్పించి ఇంటర్ తరగతులు నిర్వహించాలి.

– యు.జోసఫ్, నియోజకవర్గ సీపీఐ సహాయ కార్యదర్శి

ఉదాహరణకు గిద్దలూరు నియోజకవర్గంలో బేస్తవారిపేట జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17 మంది ఉండగా మొదటి సంవత్సరంలో ఒక్కరు కూడా చేరలేదు. బోధనకు ఉపాధ్యాయులు లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. విద్యార్థులకు కంభం జూనియర్ కళాశాలలో తరగతులు చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. అలాగే గిద్దలూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో అధ్యాపకుల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు 51 మంది ఉన్నారు. గిద్దలూరు మండలంలోని ముండ్లపాడు హైస్కూల్‌లో ఉపాధ్యాయులు లేకపోవడంతో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 31 మంది ఉండగా 16 మంది టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. మొదటి సంవత్సరంలో ఒక విద్యార్థి చేరారు. గిద్దలూరులోని జెడ్పీ బాలురలోని ప్లస్‌టూ కళాశాలలో తరగతులు చెప్పించేందుకు ప్రయత్నిస్తున్నారు.

నీటి సరఫరా పైపులు దోచుకెళ్తున్నారు

- కోట్లాది రూపాయలు లబ్ధిపొందేందుకే టీడీపీ కాంట్రాక్టర్ ఎత్తుగడ
- కూటమి నాయకుడి అనుమతితోనే పైపులు ఎత్తుకెళ్తున్నారని ఆరోపణ
- పైపులైన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



వెలికి తీసిన పైపులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: పట్టణ ప్రజలకు తాగు నీరు సరఫరా చేయాలని వరల్డ్ బ్యాంక్ ఆర్థిక సహాయంతో దూపాడు నుంచి బొర్రెడ్డిపల్లె జంక్షన్ మీదుగా స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఆవరణలో ఉన్న సంప్ వరకు భూమిలో వేసిన పైపులను టీడీపీకి చెందిన ఒక కాంట్రాక్టర్ వెలికితీసి వేరే ప్రాంతంలో తాను కాంట్రాక్ట్ పనులు చేస్తున్న ప్రాంతానికి ఎత్తుకెళ్తున్నాడు. తమ అవసరాల కోసం వేసిన పైపులను అక్రమంగా తీసుకెళ్లడాన్ని స్థానికులు అభ్యంతరం తెలిపారు. ఈనేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ పైపుల వెలికి తీసే ప్రాంతాలను పరిశీలించారు. అప్పటికే వెలికి తీసిన పైపులను లారీల్లో ఎత్తుకెళ్తుండడాన్ని చూసి ఆయన అభ్యంతరం తెలిపారు. ఇక్కడ జరుగుతున్న పరిస్థితుల గురించి మార్కాపురం సబ్ కలెక్టర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈలతో ఎమ్మెల్యే మాట్లాడారు. వాటి వివరాలను వారినుంచి అడిగి తెలుసుకొని పైపుల తరలింపును అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుక్కెడు నీళ్ల లేక ప్రజలు అలమటిస్తుంటే ఉన్న పైపులైన్ ద్వారా నీటిని అందించకుండా భూమిలో పైపులు వృథాగా పడి ఉన్నాయన్న సాకుతో ఎత్తుకెళ్లడం కూటమి ప్రభుత్వ అవినీతికి, దుర్మార్గపు చర్యలకు నిదర్శనమని అన్నారు. ఒక్కొక్క పైపు రూ.48 వేలు విలువ చేస్తాయని, వందల సంఖ్యలో పైపులను వెలికి తీసి వాటిని అప్పనంగా ఎత్తుకెళ్లి సొమ్ము చేసుకోవటానికి కాంట్రాక్టర్ పథకాన్ని రచించాడని ఆయన అన్నారు. అందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కుమ్మక్కయి నేల లోపల ఉన్న పైపులను వెలికితీసి తీసుకొని వెళ్లేందుకు అనుమతి ఇవ్వడం సరైన పద్ధతి కాదన్నారు. దొనకొండ మండలంలోని చందవరం స్కీం వద్దకు ఈ పైపులు తరలించి అక్కడి నుంచి కాంట్రాక్టర్ తాను తీసుకున్న కాంట్రాక్ట్ పనులకు ఉపయోగించుకునేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒకటిన్నర కిలో మీటరు వరకు మాత్రమే పైపులను వెలికితీసుకునేందుకు అనుమతి ఇచ్చారని, కాంట్రాక్టర్ మాత్రం 26 కిలో మీటర్ల దూరం వరకు వేసిన పైపులను కాజేందుకు పూనుకున్నాడని ఆయన ఆరోపించారు. ఇప్పటి వరకు దాదాపు 6 కిలో మీటర్ల మేర భూమిని తవ్వి పైపులను వెలికి తీశారని, అందులో రెండు కిలో మీటర్ల వరకు వెలికి తీసిన పైపులను తీసుకొని వెళ్లారని ఆయన వివరించారు. నేలలో వేసిన పైపులు వెలికి తీసి తీసుకెళ్లేందుకు ఈఎన్‌సీ శాఖ నుంచి ఎన్‌వోసీ పొందాలని, ఆ శాఖ సెక్రటరీ అనుమతి ఇచ్చిన తరువాత స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేతో చర్చించి పైపులు తొలగించాల్సి ఉందని, అటువంటి ప్రక్రియ ఏమీ లేకుండా ఎస్ఈ ఒకటిన్నర కిలో మీటర్ల మేర పైపులు తీసుకొని వెళ్లేందుకు ఏ విధంగా అనుమతి ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. పైపులు దొంగలు ఎత్తుకొని వెళ్తున్నారని, ఈ కారణంగా నేల నుంచి బయటికి తీసిన పైపులు చందవరం స్కీంకు తరలించేందుకు అనుమతి ఇచ్చామని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తోందని అన్నారు. భూమిని తవ్వి పైపులను దొంగలు ఏ విధంగా ఎత్తుకొని వెళ్తారని, టీడీపీ దొంగలకే అది సాధ్యమవుతుందని ఆయన వ్యంగ్యంగా అన్నారు. జాతీయ రహదారి 565లో డ్యామేజి అయిన పైప్‌లైన్‌కు ప్రత్యామ్నాయంగా అప్పట్లో దాదాపు రూ.7 కోట్లతో 90 సంవత్సరాల మన్నిక కలిగిన డీఐకే 7 పైపులను ఏర్పాటు చేశారని, అటువంటివి 20 సంవత్సరాలకే ఏ విధంగా చెడిపోతాయని ఆయన ప్రశ్నించారు. ప్రజల దాహార్తి తీర్చే ప్రధాన పైపులైన్ ఎప్పుడైనా చెడిపోతే ప్రత్యామ్నాయంగా ఈ పైప్‌లైన్ ఉపయోగపడుతుందని, లేకుంటే ఆ లైన్ ద్వారా మరో ప్రాంతానికి నీటి సరఫరా చేసేందుకు ఉపయోగించాల్సిన అవసరం ఉంటుందని అన్నారు. ఈ పైపులు వెలికితీసి ఎత్తుకొని వెళ్లేందుకు నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకుడి హస్తం కూడా ఉండి ఉంటుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. వెలికి తీసిన పైపులను అధికారులు స్వాధీనం చేసుకొని నియోజకవర్గ ప్రజల నీటి అవసరాలు తీర్చేందుకు సద్వినియోగం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు ఏకుల మునలారెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్.అరుణాబాయి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జానకి రఘు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పి.రాములు నాయక్, పుల్లలచెరువు వైస్ ఎంపీపీ లింగంగుంట్ల రాములు, సర్పంచ్‌లు ఆవుల కోటిరెడ్డి, తమ్మినేని సత్యనారాయణరెడ్డి, ఆవుల రమణారెడ్డి ఉన్నారు.

పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యం

- చంద్రబాబు ఎన్నికలకు ముందు ఒక మాట...తరువాత మరోమాట
- కేంద్రం పంపిన 15వ ఆర్థిక సంఘం నిధులు కూడా పంచాయతీలకు విడుదల చేయని వైనం
- సర్పంచుల సంఘ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బెజవాడ శ్రీరామమూర్తి

ఒంగోలు సబర్బన్: పంచాయతీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ టీడీపీ కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు బెజవాడ శ్రీరామమూర్తి ధ్వజమెత్తారు. ఈ మేరకు స్థానిక జిల్లా సంఘం కార్యాలయంలో ఆదివారం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బెజవాడ శ్రీరామమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలకు వ్యతిరేకంగా ఎంజీఎన్ఆర్‌జీఎస్ నిధులను పంచాయతీల ద్వారా జమ చేయకుండా కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాల్లోకి వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆ నిధులను పంచాయతీ అకౌంట్లకు జమచేయాలని ఆదేశించినా, ఆ ఆదేశాలను అమలు చేయకుండా నేరుగా కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి జమ చేయడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 15వ సంఘం ఆర్థిక నిధులు రూ.1,121.20 కోట్లను 6 నెలల క్రితం విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు పంచాయతీలకు విడుదల చేయలేదన్నారు. తద్వారా పంచాయతీలు విధులు నిర్వర్తించడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయాన్ని సర్పంచుల సంఘ ప్రతినిధులు అనేకమార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్, పర్యావరణ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదన్నారు. త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారే కానీ ఇంతవరకు నిధులు జమచేయలేదన్నారు. చంద్రబాబు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్న సమయంలో తాము అధికారంలోకి వస్తే పంచాయతీల్లో జరిగే పనులన్నింటినీ తప్పనిసరిగా పంచాయతీలు చేసే తీర్మానం ప్రకారం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర బడ్జెట్లో 6 శాతం నుంచి క్రమేణా 10 శాతం నిధులను పంచాయతీలకు నేరుగా కేటాయించి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటుచేసి, తద్వారా పంచాయతీలకు నిధులు క్రమం తప్పకుండా అందజేస్తామని హామీ ఇచ్చారన్నారు. సర్పంచులకు ఇస్తున్న రూ.3 వేలు గౌరవ వేతనాన్ని రూ.10 వేలు చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత అన్నీ మరిచిపోయినట్లు ఉన్నాడని మండిపడ్డారు. ఈ హామీలన్నింటినీ 3 నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎంపీటీసీ సభ్యులకు, ఎంపీపీలకు, జెడ్పీటీసీ సభ్యులకు ఇస్తున్న గౌరవ వేతనాన్ని కూడా రూ.10 వేలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. పై హామీలు అమలు పరచకపోగా నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. విధులు నిర్వర్తించడంలో పంచాయతీలకు జరుగుతున్న ఇబ్బందులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం ఒంగోలు రావాలని సర్పంచ్‌లకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం నాయకులు ప్రధాన కార్యదర్శి పగడాల రమేష్, ఉపాధ్యక్షుడు మారం ఇద్రసేనారెడ్డి, అధికార ప్రతినిధి రావెళ్ల సుధాకర్‌తో పాటు సంఘం సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

కోట, సరోజాదేవిలకు ఘన నివాళి

ఒంగోలు మెట్రో: నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ అండ్ క్లబ్ ఆవరణలో ఇటీవల దివంగతులైన ప్రముఖ సినీ నటులు కోట శ్రీనివాసరావు, బీ సరోజా దేవిల సంస్మరణ సభ నిర్వహించారు. తొలుత కోట, సరోజాదేవి చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు మాట్లాడుతూ దక్షిణ భారత చలన చిత్ర రంగంలో తమదైన శైలిలో రాణించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలతో పాటుగా సినీ ప్రేక్షకుల హృదయాల్లో ఎన్నటికీ చెరగని స్థానం పొందిన వీరు ధన్యులని అన్నారు. లలిత కళా అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ తన విలక్షణమైన నటనతో ప్రతి నాయకుడిగా సహాయ నటుడిగా, హాస్య నటుడుగా ఏ పాత్రలోనైనా ఒదిగిపోయి ఆ పాత్రలకు సంపూర్ణ న్యాయం చేకూర్చే పద్మశ్రీ కోట శ్రీనివాసరావు మరణం అత్యంత బాధాకరం అన్నారు. జిల్లా రంగ భూమి కళాకారుల సంఘం కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ మాట్లాడుతూ తెలుగులో ఎన్టీఆర్, తమిళంలో ఎంజీఆర్, కన్నడంలో రాజ్ కుమార్ సరసన అనేక హిట్ చిత్రాల్లో నటించిన అలనాటి అందాల తార పద్మభూషణ్ బీ సరోజా దేవి మరణం సినీ ప్రేక్షకుల హృదయాల్లో విషాదం నింపిందని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అటవీ శాఖ అధికారి గుంటూరు సత్యనారాయణ, పొదిలి బాల గురవయ్య, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.



కోట శ్రీనివాసరావు, సరోజినీ దేవి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

బదిలీ అయిన ఉపాధ్యాయులకు జీతాలివ్వండి

- యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

ఒంగోలు సిటీ: బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ జీతాలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ ప్రకాశం జిల్లా కార్యదర్శివర్గ సమావేశం ఒంగోలు యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులందరికీ జీతాలు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. బదిలీలు పూర్తయి నెల రోజులైనా కొత్త పోస్టులకు పొజిషన్ ఐడీలు ఇవ్వకపోవడం సరైన పద్ధతి కాదని, వెంటనే పొజిషన్ ఐడీలు ఇచ్చి జీతాల సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డీ వీరాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో బదిలీ అయినా రిలీవర్స్ లేక చాలామంది ఉపాధ్యాయులు పాత స్థానాల్లోనే కొనసాగుతున్నారన్నారు. డీఎస్సీ పోస్టులు ఇచ్చినా కూడా ఇంకా జిల్లాలో 500 ఎస్‌జీటీ ఖాళీలు ఉంటాయని, అర్హత ఉన్న అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాత పీఆర్సీ కమిటీని రద్దు చేయడం తప్ప, పీఆర్సీ గానీ, ఐఆర్ ఊసే లేకపోవడాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్రంగా నిరసిస్తున్నారని, మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నా కనీసం ఒక డీఏ గురించి కూడా మాట్లాడకపోవడం సరైంది కాదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యోగ, ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతారని హెచ్చరించారు.

కార్యవర్గ సమావేశం అనంతరం ఎస్‌టీఎఫ్ఐ ఆల్ ఇండియా ట్రైనియల్ కాన్ఫరెన్స్ పోస్టర్‌ను ఈసీ మెంబర్ కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ హై, డీ వీరాంజనేయులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ రవి, జీ ఉమామహేశ్వరి, ఎస్ చిన్నస్వామి, ఎం సత్యనారాయణ రెడ్డి, పీ బాల వెంకటేశ్వర్లు, సీహెచ్ ప్రభాకర్ రెడ్డి, ఎం సంధ్యారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కొమ్మోజు శ్రీనివాసరావు

క్లుప్తంగా

మేడం..మీరే నన్ను కాపాడండి

● కలెక్టర్ వద్ద రైతు కన్నీటిపర్యంతం



కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్న రైతు

మార్కాపురం: ' మేడం మీరే నన్ను కాపాడండి' అంటూ ఓ రైతు కలెక్టర్ కాళ్ల పట్టుకోబోయిన సంఘటన మార్కాపురంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. మార్కాపురం వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పెద్దారవీడు మండలం మద్దలకట్ట గ్రామానికి చెందిన రైతు దొడ్డ కోటిరెడ్డి తన బాధను వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు. హైవేపనుల్లో భాగంగా తనకు జీవనాధారమైన పొలాన్ని ప్రభుత్వం భూసేకరణ కింద సెంటుకు రూ.9 వేలే ఇస్తామంటున్నారని, కనీసం రూ.50వేలైనా ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్ కాళ్లపట్టుకున్నాడు. తన ఆవేదనంతా కన్నీటిరూపంలో కలెక్టర్‌కు వివరించాడు. ఆ పొలమే తనకు జీవనాధారమని, భూసేకరణలో హైవేరోడ్డు కింద తీసుకుంటే తనకు కుటుంబ పోషణ కష్టమని, న్యాయం చేయాలని కోరాడు. ఈ లోగా కలెక్టర్ వ్యక్తిగత సిబ్బంది, పోలీసులు రైతును సముదాయించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



విలపిస్తున్న భార్య

సింగరాయకొండ: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొన్న ప్రమాదంలో మోటార్ సైకిలిస్టు మృతి చెందాడు. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండల పరిధిలోని జాతీయ రహదారిపై బీకే క్రషర్స్ కంపెనీ సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..కందుకూరు నియోజకవర్గం పలుకూరు గ్రామానికి చెందిన షేక్ సుభానిబాషా(40) ఒంగోలులో టైలర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవల కుమారుడు షేక్ రిహాన్‌కు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. కుమారుడిని కాలేజీలో చేర్పించి తిరిగి భార్య ఆఫ్రిన్‌తో కలిసి వస్తున్నాడు. ఈ క్రమంలో బీకే క్రషర్స్ కంపెనీ సమీపంలోకి రాగానే రోడ్డు మార్జిన్‌లో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టాడు. ప్రమాదంలో సుభానిబాషాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా..చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

పెట్రోల్ బంక్ సిబ్బందిపై యువకుల దాడి



శేషయ్యపై దాడి చేస్తున్న యువకులు

కొండపి: పెట్రోల్ బంకులో పనిచేస్తున్న వ్యక్తిపై యువకులు దాడి చేశారు. సంఘటన స్థానిక భారత్ పెట్రోల్ బంకులో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు ఇనుకొల్లు శేషయ్య తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై పెట్రోల్ కొట్టించుకునేందుకు వచ్చారు. పెట్రోల్ కొట్టిన తర్వాత నగదు అడిగితే ఫోన్ పే చేశానని పెద్ద కళ్లగుంటకు దాచర్ల సుమంత్ అనే యువకుడు చెప్పగా.. ఫోన్‌పే రాలేదని, చూయించమని అడగ్గా.. సదరుతో యువకుడితో పాటు అతని స్నేహితులు శేషయ్యపై దాడికి తెగబడ్డారు. వారి దాడిలో రెండుసార్లు కిందపడిన శేషయ్యపై పిడుగులు గుద్దడంతో తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయాడు. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ఒంగోలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గతంలో కూడా ఆ యువకుడు ఇదే విధంగా గొడవపడ్డాడని బాధితుడు తెలిపాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైప్రేమ్‌కుమార్ తెలిపారు.

సముద్రంలో వ్యక్తిని కాపాడిన మత్స్యకారులు

కొత్తపట్నం: సముద్రతీరంలో అలల ఉధృతికి వ్యక్తి కొట్టుకుపోతుండగా స్థానిక మత్స్యకారులు కాపాడారు. ఈ సంఘటన మండలంలోని మడనూరులో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలోని రాజుపాలెం గ్రామానికి చెందిన విశ్వజిత్ అనే వ్యక్తి ఆదివారం సముద్రస్నానానికి వచ్చాడు. అయితే అలల ఉధృతికి అతను సముద్రంలోకి కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న మత్స్యకారులు గమనించి అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చారు. అయితే సముద్రంలో మరో వ్యక్తి గల్లంతడయ్యాడని పుకార్లు వినిపించాయి. అయితే మెరైన్ పోలీసులు గాలించినా ఎక్కడ అచూకీ లేదు. ఎస్సై సుధాకర్‌బాబు, మెరైన్ ఎస్సై సుబ్బారావు పాల్గొన్నారు.



ఇస్లాంపేటలో రోడ్డు పక్కన నిల్వ ఉన్న చెత్త



గోరంట్ల కాంప్లెక్స్ రోడ్డులోని ఇటుక బట్టీ సెంటర్‌లో ఉన్న చెత్త

నగర పాలన దిగజారి.. చెత్త, మురుగు చేరి..!

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో చెత్త, మురుగు నగరంగా ఒంగోలు
- జాతీయ స్థాయిలో 820 నగరాల్లో ఒంగోలు నగరానికి 459వ స్థానం
- రాష్ట్ర స్థాయిలో 66 నగరాల్లో 20వ స్థానానికి దిగజారిన వైనం
- ఒకవైపు పారిశుధ్య కార్మికుల సమ్మె బాట
- మరోవైపు ఇంజినీరింగ్ విభాగంలోని కార్మికులు కూడా..
- నగరంలో ఎక్కడచూసినా చెత్త, మురుగుతో దుర్వాసన
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన క్లాప్ ఆటోలను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- పారిశుధ్యాన్ని మెరుగుపరచడంలో పూర్తిగా విఫలం



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇళ్లలోని తడి చెత్త, పొడి చెత్తను వేరు చేసి డస్ట్‌బిన్ల ద్వారా సేకరిస్తున్న మహిళలు (ఫైల్)

ఒంగోలు సబర్బన్:

ఒంగోలు నగరం చెత్తాచెదారంతో కుళ్లిపోతోంది. మురుగుతో దుర్గంధం వెదజల్లుతోంది. నగర పాలక సంస్థ పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణలో కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేషన్ ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిగా విఫలమవడంతో ఈ దుస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో చెత్త, మురుగు నగరంగా ఒంగోలు నగరపాలక సంస్థ నిలిచింది. కూటమి పాలకులు, అధికారుల అధ్వానపు పనితీరుకు నిలువెత్తు నిదర్శనంగా మారింది. వారి అనాలోచిత నిర్ణయాలతో పారిశుధ్య కార్మికులు సమ్మె బాట పట్టారు. ఫలితంగా కొద్దిరోజులుగా నగరంలో చెత్త పేరుకుపోయింది. వర్షానికి కుళ్లిపోయి కంపు కొడుతోంది. కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగు ముందుకు కదలక వర్షం నీటితో రోడ్లపైకి చేరింది. మురికి కూపాలు ఏర్పడి అపరిశుభ్రత తాండవిస్తోంది. ప్రజలపై పగబట్టినట్లుగా కూటమి పాలకులు, అధికారుల పనితీరు ఉందన్న చర్చ జరుగుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చెత్త పన్ను వేస్తున్నారంటూ లేనిపోని ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబు, కూటమి పాలకులు.. ప్రస్తుతం అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వంలో చెత్త సేకరణ కోసం ప్రవేశపెట్టిన క్లాప్ ఆటోలను నిలువునా రద్దు చేశారు. ఒంగోలు నగరంలోని 50 డివిజన్లలో చెత్త సేకరించే క్లాప్ ఆటోల రద్దుతో అధికారులు, సిబ్బందికి చెత్త సేకరించడం పెద్ద తలనొప్పిగా మారింది. చివరకు పారిశుధ్యం అటకెక్కి ఒంగోలు నగరం చెత్తకుండీలా తయారైంది. ఏడాదికేడాదికీ విస్తరిస్తోన్న నగరంలోని ప్రజలకు పరిశుభ్రత కరువైంది.

స్వచ్ఛత ర్యాంకింగుల్లో బాగా వెనకబడిన ఒంగోలు...

జాతీయ స్థాయిలో పారిశుధ్య నిర్వహణపై స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ సర్వేలను ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా ముందుకు తీసుకెళ్తోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రతి వారం స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తోంది. కేంద్ర ప్రభుత్వం పంచాయతీ స్థాయికి ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తోంది. పరిశుభ్రమైన నగరాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నప్పటికీ.. ఒంగోలు నగరపాలక సంస్థలో మాత్రం పాలకులు, అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా కంపు కొడుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్వచ్ఛతలో ఒంగోలు నగర పాలక సంస్థ జాతీయ స్థాయి అవార్డు అందుకోగా, ప్రస్తుతం కూటమి పాలనలో పూర్తిగా దిగజారిపోయింది. తాజాగా ప్రకటించిన కేంద్ర స్వచ్ఛ భారత్ ర్యాంకుల్లో ఒంగోలు నగరపాలక సంస్థ స్వచ్ఛతపై నిర్దేశించిన 10 వేల మార్కులకు 6,250 మార్కుల వద్దే ఆగిపోయింది. వివిధ కేటగిరీల్లో ర్యాంకులు ప్రకటించగా, జాతీయ స్థాయిలో 820 నగరాల్లో ఒంగోలు నగరం 459వ స్థానంలో, రాష్ట్రస్థాయిలో 66 నగరాల్లో 20వ స్థానంలో నిలిచి ఇక్కడి పారిశుధ్య పనుల నిర్వహణలో లోపాలను చెప్పకనే చెబుతోంది.

క్లాప్ ఆటోలను తొలగించి తీవ్ర అన్యాయం...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నగరాలు మొదలుకుని గ్రామ పంచాయతీల వరకు పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ఆలోచనలకు పదును పెట్టి క్లాప్‌మిత్రలను తీసుకొచ్చి, క్లాప్ ఆటోలను ప్రవేశపెట్టారు. నగరాలు మొదలుకుని గ్రామ స్థాయి వరకు వాటిని పంపారు. వాటికి తోడు మూడు రంగుల ప్లాస్టిక్ డబ్బాలను ప్రతి ఇంటికీ ఇచ్చి ఇళ్లలో చెత్తను మూడు భాగాలుగా విభజించి ఇచ్చేవిధంగా ఒంగోలు నగర పాలక సంస్థ అధికారుల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ఒక్కో రంగు ప్లాస్టిక్ డబ్బాలో ఒక్కో రకమైన చెత్తను నింపి క్లాప్ ఆటోలకు ఇచ్చే విధంగా ఏర్పాటు చేశారు. ఆ ప్లాస్టిక్ డబ్బాలను కూడా ప్రతి ఇంటికి నగర పాలక సంస్థ నిధులతో కొనుగోలు చేసి మరీ ఉచితంగా అందజేశారు. దాంతో తడి, పొడి, ప్రమాదకర చెత్తలుగా విభజించి మరీ క్లాప్ ఆటోలకు ప్రజలు అందించేవారు. పారిశుధ్యానికి ఎలాంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా పరిశుభ్ర నగరంగా ఒంగోలును తీర్చిదిద్దారు. ఫలితంగా అప్పట్లో జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్, స్వచ్ఛ భారత్ అవార్డును కూడా ఒంగోలు నగరం కైవసం చేసుకుంది.

అధ్వానంగా చెత్త సేకరణ...

ఇంటింటి నుంచి చెత్త సేకరణలో నూటికి 68 ఇళ్ల వద్దనే సేకరిస్తున్నారని సర్వేలో తేలింది. తడి చెత్త, పొడి చెత్తను విడదీసి సేకరించడంలో కేవలం 16 శాతం వద్దే ఆగిపోయింది. సేకరించిన చెత్తను రీసైకిల్, రీ యూజ్ చేయడాన్ని పూర్తిగా వదిలేశారు. పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ సున్నా అని, వాటి గురించి అసలు పట్టించుకోవడం లేదని కేంద్రం ప్రకటించిన నివేదికలో తేల్చేశారు. ప్రధాన కూడళ్లలో, మార్కెట్ ప్రాంతాల్లో చెత్తకుప్పలను 88 శాతమే తొలగిస్తున్నారని, కాలనీలు, నివాస ప్రాంతాల మధ్యలో వదిలేస్తున్నారని తేలింది. నీటి వనరుల ప్రాంతాల్లో 67 శాతమే పారిశుధ్యం నిర్వహిస్తున్నట్లు కేంద్రం ప్రకటించిన ర్యాంకుల్లో తేల్చారు. ఇలా ఒంగోలు నగరపాలక సంస్థ పారిశుధ్య నిర్వహణలో రోజురోజుకూ దిగజారిపోతోందని నివేదికలు తేటతెల్లం చేశాయి. ఇప్పటికే చెత్తసేకరణ, పరిశుభ్రతలో నగరం కంపుకొడుతోందన్న విమర్శలున్నాయి. వీటిని అధిగమించడంలో నగరపాలక సంస్థ అధికారులు, పాలకులు పూర్తిగా విఫలమయ్యారని, అవినీతి అక్రమాలతో జేబులు నింపుకునే పనిలో ఉన్నారన్న ఆరోపణలున్నాయి.



ఒంగోలు నగరంలోని గోపీ థియేటర్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త, మురుగు

716 మంది సమ్మెలోకి...

ప్రస్తుత కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఒంగోలు నగరంలో పనిచేస్తున్న 716 మంది పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. గత ఎన్నికల సమయంలో గెలుపే పరమావధిగా భావించిన చంద్రబాబు.. కూటమి పార్టీలతో జతకట్టి నోరుపట్టనన్ని హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా పారిశుధ్య కార్మికులకు, నగర పాలక సంస్థలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు. దాంతో ఏడాది వరకు వేచిచూసిన మున్సిపల్ కార్మికులు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చారు. అయినా కూటమి ప్రభుత్వం సమ్మె నోటీసును సైతం పెడచెవిన పెట్టడంతో తప్పనిసరి పరిస్థితుల్లో కార్మికులు సమ్మెలోకి దిగారు. ఈ నెల 12వ తేదీ నుంచి ఇంజినీరింగ్ విభాగంలోని 36 మంది కార్మికులు కూడా సమ్మె చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో ఉన్న 108 మంది కార్మికుల్లో 36 మంది సమ్మెలోకి వెళ్లారు. మిగతా వారు కూడా నేడో, రేపో సమ్మెకు మద్దతు ప్రకటించవచ్చని తెలుస్తోంది. ఆ వెంటనే గత మూడు రోజుల నుంచి పారిశుధ్య కార్మికులు కూడా వాళ్ల న్యాయమైన కోర్కెల సాధన కోసం సమ్మెలోకి దిగారు. ఒంగోలు నగర పాలక సంస్థలో పారిశుధ్య కార్మికులు మొత్తం 750 మంది ఉండగా, వారిలో 680 మంది సమ్మెబాట పట్టారు.

ఒంగోలు నగరపాలక సంస్థ వివరాలు...

జనాభా	3.10 లక్షలు
డివిజన్లు	50
ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలోని డివిజన్లు	44
సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గంలోని డివిజన్లు	6
పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది	750 మంది

మోకాళ్లపై నిలబడి కార్మికుల నిరసన



పొదిలిలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కార్మికులు



ఒంగోలులో మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులు

ఒంగోలు సబర్బన్: నగరపాలకసంస్థ, మున్సిపాలిటీల్లో పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సీఐటీయూ నగర కార్యదర్శి టి.మహేష్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. స్థానిక ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయం ముందు ఆదివారం కూడా కార్మికులు సమ్మె చేశారు. మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో భాగంగా ఆదివారం వినూత్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. అందరికీ సమాన పనికి సమాన వేతనాలు ఇస్తామని, కనీస వేతనాలు అమలు చేస్తామని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. యూనియన్ అధ్యక్షుడు జి.నరసింహ, నాయకులు కె.మోహన్‌రావు, జాలయ్య, వెంకట్రావు, అనిత, రమణ, ఎం బాబు, ఏ రవి, ఏడుకొండలు, వంశీ, సుధాకర్, శశి పాల్గొన్నారు.

పొదిలిలో అర్ధనగ్న ప్రదర్శన

పొదిలి: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పారిశుధ్య కార్మికులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎం.రమేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. విమర్శించారు. సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం జీఓ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో ఉన్నవారిపై పనిభారం పెరుగుతుందని అన్నారు. టి.సుబ్బయ్య, కెవి.నరసింహం, బి.కోటేశ్వరావు, వి.నాగేశ్వరావు, కోటేశ్వరమ్మ, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

ఒంగోలు టౌన్: మహిళలకు ఉపాధి, విద్యావకాశాలను పెంచడం ద్వారా సమాజం మరింత వేగంగా ప్రగతి పథంలో పయనిస్తుందని డాక్టర్ ఎస్ దయని చెప్పారు. స్థానిక ఎల్బీజీ భవనంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 12వ నగర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఉదయని మాట్లాడుతూ..సమాజంలో నాటుకుపోయిన పితస్వామిక భావజాలం మహిళల అభ్యున్నతికి ఆటంకంగా నిలిస్తుందన్నారు. మారుతున్న కాలానికనుగుణంగా మహిళలు తమకు ఎదురవుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. సనాతన సంప్రదాయాలు, కట్టుబాట్ల పేరుతో చిన్నవయసులోనే బాలికలకు వివాహాలు చేయడం, పిన్న వయసులోనే బిడ్డలను కనడం విచారకరమన్నారు. పోషకాహార లోపం, రక్తహీనత, ఎముకలు పెలుసు బారడం వంటి అనేక వ్యాధులకు గురవతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల నుంచి బయటపడేందుకు మహిళలకు విద్య అవసరమన్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల రమాదేవి, నగర నాయకులు గోవిందమ్మ ఆదిలక్ష్మి, నరసమ్మ, మొబీన్, రాజ్యలక్ష్మి, మధురవాణి, రంగమ్మ పాల్గొన్నారు.

శాకంబరిదేవిగా వల్లూరమ్మ తల్లి



వల్లూరమ్మకు దర్శించుకుంటున్న భక్తులు



శాకంబరిదేవి అలంకరణలో వల్లూరమ్మ తల్లి

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన వల్లూరమ్మ తల్లి ఆలయంలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారు ఆదివారం శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం కూరగాయలతో ముచ్చటగా అలంకరించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈఓ రమేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాతకక్షల నేపథ్యంలో దాడి



లక్ష్మణ్‌పై దాడి చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ అనురాధ కుటుంబం

ఒంగోలు టౌన్: పాత కక్షలు మనసులో పెట్టుకొని అంగన్‌వాడీ టీచర్ పొరిగింటి వారిపై దాడికి పాల్పడింది. బాధితుడి కుమారుడు సాయి తెలిపిన కథనం ప్రకారం...ఒంగోలు మండలంలోని త్రోవగుంట ఎస్సీ కాలనీకి చెందిన కాకి లక్ష్మణ్ పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అతడికి పొరిగింట్లో నివసించే నావూరి కుమార్, అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసే అతడి భార్య అనురాధకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఇది మనసులో పెట్టుకొన్న కుమార్ కుటుంబం శుక్రవారం రాత్రి లక్ష్మణ్‌పై దాడి చేసింది. దాడిలో లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఒంగోలులోని జీజీహెచ్‌కు తరలించారు. అయితే కుమార్‌కు అధికార పార్టీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తుంది. తన తండ్రిపై అకారణంగా దాడి చేసి కొట్టిన అంగన్‌వాడీ టీచర్ అనురాధ, ఆమె భర్త కుమార్‌లను శిక్షించాలని కుమారుడు కోరుతున్నాడు.